కథ 2006

11



# జీవచ్ఛవాలు

పి. చిన్నయ్య

"మంచినీళ్లు పంపు..." ఇది మూడోసారి కావచ్చు బహుశా కూతేయటం. అయినా లోపలి నుండి ఉలుకుపలుకు లేదు. లేచి యింట్లకు పోదామనుకుంటుండంగానె పనిమనిషి పెద్ద జగ్గులో నీళ్లు తీసుకొని రావటం కనిపించి, కోపాన్ని బలవంతంగా ఆపుకుండు సురేందర్ రెడ్డి.

'టీ' వచ్చి అప్పటికే అయిదు నిమిషాలయ్యింది. దాన్ని ఎవరు నోట్ల పెట్టుకోలేదు. మంచినీళ్లు కాదు, ఫిల్టర్ నీళ్లు తాగుదామని!

వచ్చిన నలుగురు మిత్రులు ఇంటి ముందున్న వేపచెట్టు కింద కూర్చున్నారు. అందరూ ప్రయాణానికి సిద్ధమై వచ్చినట్టుంది. సురేందర్ గూడ తయారయి ఉండు.

సురేందర్ ఇంటి చుట్టూ ప్రహరీగోడ ఉంది. ఈశాన్యంలో మూలకు గేటు ఉంది. ప్రహరీగోడకు ఆనుకొని ఆగ్నేయం మూలకు తాతలనాటి పెద్ద పశువుల కొట్టం ఉంది. అంత పెద్ద కొట్టంలో అన్ని పశువులు లేవుగాని ఒక మూలకు ట్రాక్టరు, ఇనుప పనిముట్లు, ఇంగో  మూలకు రెండు బర్లు మేస్తున్నాయి. గేటు పక్కనే జీపు ఆగి ఉంది. జీపును శుభ్రం చేసుకుంటుండు డ్రైవరు.

పనిమనిషి గ్లాసుల పోస్తున్న నీళ్లను గుక్కెడు మింగి మిగతా నీళ్లను పారబోస్తున్నారు. మొదట్లో అర్థం కాలేదు. తను గూడ ఒక గుక్కెడు నీళ్లు మింగాక అర్థమయింది సురేందర్‌కు అవి ఫిల్టర్ నీళ్లు కావని, బోర్ల నీళ్లు అని.

అప్పటికే చల్లారిన చాయ్‌ను గబగబా మింగి నలుగురు లేచి నిలబడి, "అన్నా బయలుదేరుదామా?" అడిగినరు.

"పోయి జీపుల కూర్చోండి, యిప్పుడే వస్తా," ఏదో పని ఉన్నవాడిలా ఇంట్లకు పోయిండు కోపంతో.

"కొద్దిగ ఫిల్టర్ వాటర్ పంపితే ఏమయింది. నీ కొంపలేమయిన  మునిగిపోయినయా?" వంటగదిల ఉన్న భార్య మీద సుర్రున లేచిండు.

సునీత సిద్ధంగానే ఉన్నట్టుంది. వెంటనే అందుకుంది.

"ఒకసారి అటు చూడు..." క్యానువైపు చూపింది.

క్యాను వైపు చూసి చల్లబడ్డడు సురేందర్.

"మొన్ననేగ ఫిల్టర్ నీళ్లు వచ్చింది. అప్పుడే అయిపోయినయా," శాంతానికి వచ్చి నెమ్మదిగా అడిగిండు.

"నీకోసం ఇంటికొచ్చినోళ్లు అడిగి మరీ తాగిపోతుంటిరి. ఏడ ఉంటయి? ఈరోజు నీళ్లు వస్తయో రావోనని పిల్లలకు ఉంచిన ఆ కొద్దిగ. ఫోన్‌చేసి తెలుసుకో నీళ్లు వస్తున్నయో రావో..." ఉడికిన కూరను దించుతూ అంది.

"దీనికి ఫోన్ ఎందుకు, సాయంత్రం వచ్చేటప్పుడు జీపుల తీసుకవస్తా..."

"జీపంటే గుర్తుకు వచ్చింది, పంచాయితికి పోతుండ్రా?" బయటకు వచ్చిన భర్తను ఆపి అడిగింది.

"అవును పంచాయితికే పోతున్నాం."

"పోతె పోయినరుగాని, వాళ్లను ఇడతీయటానికి చేయకండి, కలిసేటట్టు చేయండ్రి, ఆ పాపం మనకు తగులుతుంది..." భర్తను హెచ్చరించింది సునీత.

టైం చూసుకుంటూ గబగబా జీపు దగ్గరికి నడిచిండు సురేందర్. అప్పటికి అందరూ ఎక్కి కూర్చొని

ఎదురు చూస్తున్నారు అతని కోసం. సురేందర్ ముందు సీట్లో కొనకు కూర్చుంటూ, జీపుల చూసిండు- ఎవ రెవరు ఎక్కినరని.

డ్రైవర్ పక్కనే ఎం.పి.టి.సి. రేగు బాలయ్య కూర్చుండు. వెనుక ఉన్న రెండు సీట్లల్లో ఒకదాంట్లో వార్డు మెంబరు రాములు, ఎల్లారెడ్డి, అంజయ్య కూర్చు న్నారు. ఇంకో సీట్లో పంచాయితిని పెట్టిన యాదయ్య, అతని పక్కన కూతురు రేణుక, రేణుక పక్కనె ఆమె చిన్నాయన భార్య కూర్చుంది.

''అయ్యా సురేందరు, ఇంకెవరినన్న పిలు ద్దామా?'' జీబు కదిలే ముందు అడిగిండు యాదయ్య.

''ఇంకెందుకు డబ్బులు దండగ, అయినా ఆడ పంచాయితీ పెట్టి మాట్లాడేది ఏముంది? ఇప్పటికే మాట్లాడితిమి. ఏదో ఒకటి తేల్చుకొని రావుడే గదా, ఏదైన కిరికిరి చేస్తే మన బాలయ్య ఒక్కడు చాలు, కిందా మీదికి చేసేటందుకు...'' నవ్వుతూ వెనకవైపు చూసిండు సురేందర్. రేణుక కండ్లల్లో కన్నీళ్లు చూసి ఏమీ మాట్లాడలేకపోయిండు.

అప్పటికే జీపు మట్టిరోడ్లు, బి.టి. రోడ్లు మీద రెండు మూడు ఊర్లను దాటి జాతీయ రహదారి తొమ్మిదో నంబరు మీదికి చేరింది. ఎడమవైపు చిట్యాల, కుడివైపు చౌటుప్పల్, జీపును కుడివైపు తిప్పిండు డ్రైవర్. చౌటప్పల్ ఇంకా అయిదు కిలో మీటర్లు ఉన్నదనంగ ఎడమవైపు ఓ మట్టిరోడ్డు మీదికి మళ్లింది జీపు. సడన్ బ్రేక్ పడ్డప్పుడల్లా వెనుక నుండి దుమ్ము కమ్ముకొస్తుంది లోపలికి. ఆ బాధను భరించ లేక అంజయ్య గుండ్రంగా చుట్టబడిన కవర్‌ను తీసి కిందికి వేలాడదీసిండు. కాస్త దుమ్ము తగ్గినట్టయింది.

జీపు మట్టిరోడ్డు మీద నుండి సంస్థాన్ నారాయణ పూర్ వైపు డాంబర్ రోడ్డు ఎక్కింది. దుమ్ము పెద్దగా లేదు. వేలాడదీసిన కవర్‌ను తిరిగి చుట్టిండు అంజయ్య.

గుట్టల వరుస మొదలయింది. అందరి కండ్లు దాని మీద పడ్డాయి.

వేసవికాలం కావటం వల్ల చెట్లన్నీ ఆకురాల్చి ఉన్నాయి. దాంతో ఆ గుట్టల వరుస స్పష్టంగా కని పిస్తుంది. అక్కడక్కడ గుట్టల చివన మొనదేలి పొడవు గా ఉన్నాయి. అక్కడోటి, ఇక్కడోటి ఉన్న మోదుగ చెట్లు. ఎర్రటి మోదుగ పూలలో ఆ గుట్టలు మరింత అందాన్నిస్తున్నాయి.

''సురేందరన్న, రాచకొండ గుట్టలంటె ఇవేనా?'' వెనుక నుండి అడిగిండు అంజయ్య.

''ఇవేరా అంజి...'' సురేందర్ చెప్పే లోపున టక్కున అందుకుండు బాలయ్య.

''ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్ పెడతామంటున్నారు ఈ గుట్టల్లోనేనా?'' తిరిగి అడిగిండు అంజయ్య గుట్టల్ని చూసుకుంట.

''అవును ఈ గుట్టల్లోనే...'' సమాధానమిచ్చిండు సురేందర్.

''ఆడ పెట్టొద్దని గొడవలు అవుతున్నాయి గదా, దానివల్ల నష్టమేంది?'' ఈసారి ఎల్లారెడ్డి అడిగిండు.

చెప్పాల్నా వద్దాన్నట్టు కొద్దిసేపు తటపాయించి చెప్పిండు.

''గిరిజనుల భూములు ఆగమవుతాయని, ఊర్లు ఖాళీ చేయాల్సి వస్తుందని గొడవ చేస్తుండ్రు...''

''అంతేనా ఇంకా చాలా కతలున్నాయి. అది ఆడ పెడ్తె అంతా ఆగమాగమె...'' బాలయ్య ఇంకా ఏదో చెప్పబోయిండుగాని జీపు ఆగటంతో మాటలు ఆగి పోయినయి.

''సంస్థా నారాయణపూర్ నుండి పోతే పది కిలో మీటర్లు ఎక్కువయితది. ఇట్లపోతే దగ్గర...'' సురేం దర్‌కు మట్టిబాటను చూపిస్తూ అండు డ్రైవర్.

''సరే పోనీయి...'' సురేందర్ అనటంతో జీపు మట్టిరోడ్డు మీదికి మళ్లింది.

''తాటివనం మస్తుగున్నట్టుందిగా...'' తాటిచెట్ల వైపు చూస్తూ అండు బాలయ్య.

''తాగాలని ఉందని చెప్పరాదు...!'' రాములు అందుకుండు.

''గింత పొద్దుగాల ఎవడు తాగుతడు. వచ్చేట పుడు ఎట్లయిన తప్పదు...'' బాలయ్య తిప్పికొట్టిండు.

''ఇగో గిక్కడనె సార్, వాటిని తవ్వి తీసిండ్రు పోలీసులు...'' దాటిపోయిన కల్వర్టును చూపిస్తూ అండు డ్రైవర్.

తవ్వి తీసినవి ఏందో అర్థమయింది గనుక వాటి గురించి అడగలేదు సురేందర్ గాని, మిగతావాళ్లు గాని.

మాటల్లోనె జీపు చేరాల్సిన ఊరుకు చేరింది. జీపు ఎక్కడ ఆపాల్నో అర్థంగాక వెనుక కూర్చున్న యాదయ్యను అడిగిండు డ్రైవరు.

యాదయ్య గూడ ఏడ ఆపాల్నో అర్థంగాక తటపాసిస్తుంటె, సురేందర్ చెప్పిండు.

''సక్కగా సర్పంచ్ ఇంటికి పోనీయి, ఆడికి పోయినంక ఆలోచిద్దాం...''

ఈ పంచాయితికి ఇప్పటికే రెండు మూడుసార్లు వచ్చిండుగనుక ఎవరు ఇల్లు ఎక్కడో తెల్సు డ్రైవరుకు.

సక్కగా సర్పంచి ఇంటివైపు తిప్పిండు. సర్పంచు ఇంటి ముందున్న పెద్ద వేపచెట్టు కింద ఆపిండు. ఒక్కొక్కరు జీపు నుండి దిగసాగింఁడు.

ఇంట్ల ఉన్న ఆ వూరు సర్పంచు జీపు చప్పుడు విని బయటకు వచ్చి చూసిండు. జీపు దగ్గర నిలబడ్డ సురేందర్‌ను చూసి నవ్వుకుంట దగ్గరికొచ్చి,

"ఏం సర్పంచుగారు బాగున్నారా?" సురేందర్ చేతిలో చేయి కలుపుతు అండు.

"బాగనే ఉన్నం సర్పంచ్‌గారు..." చేతిని గట్టిగ వత్తుతు అండు సురేందర్. ఈ పంచాయితి చేయబట్టి ఇద్దరు సర్పంచులూ మంచి దోస్తులు అయినరు!

"నిన్న ఫోన్ చేస్తిరి గదా మీరు. మీకోసం ఎదురు చూస్తున్న ఎప్పుడు వస్తరాని. ఈ పంచాయితి ఉందని పొద్దుగాల్నే నారాయణపూర్ పోయి గింతపని ఉంటె చూసుకొని ఇంతకు ముందే వచ్చిన, తిని ఇట్ల కూర్చున్న మీరు వచ్చినరు..." చెట్టు కింద మంచాలు, కుర్చీలు ఏపిస్తూ చెప్పకపోయిండు...

"... మంచినీళ్లు తాగుతరా?" మర్యాదకు అడి గిండు కొనసాగింపుగా.

"వద్దు తీయి ఇప్పుడే తాగి వచ్చినము..." అబద్ధం ఆడిండు బాలయ్య.

"తాగితె ఏందిగాని, ఈ ఎండలకు ఎంతసేపుం టయి కడుపుల... ఇగో క్యాన్‌ల పొద్దుగాల పట్టుకొచ్చిన ఫిల్టర్ వాటర్ వుంది పంపీయి..." ఇంట్లోకి కూతేసిండు సర్పంచ్.

ఫిల్టర్ వాటరనేసరికి అందరికి మరిచిపోయిన దూప గుర్తుకొచ్చినట్టయింది. పెద్ద చెంబుల నీళ్లు పట్టుకొచ్చిన పదేళ్ల సర్పంచు కొడుకు సుక్కనీరు కింద పడకుండ జాగర్తగ గ్లాసుల పోస్తుండు. ఇద్దరు ముగ్గురికి చెంబుల నీళ్లు అయిపోయినయి. నీళ్లు తేవటానికి ఇంట్లోకు ఉరికిండు సర్పంచు కొడుకు.

ఒక్కొక్కరు సర్పంచ్ ఇంటి దగ్గరకు రాసాగింఁడు ఊరోళ్లు. వాళ్లకు పంచాయితీ విషయం తెలిసినట్టుంది.

"సర్పంచ్ సాబ్, ఆ అబ్బాయిని, తల్లిదండ్రులను పిలిపిస్తే బాగుంటుంది, తొందరగ అయిపోతే మేము ఎల్లిపోతం, పనులు బాగున్నాయి..." నెమ్మదిగ కది పిండు సురేందర్.

"నేను గూడ అదే అనుకుంటున్న సర్పంచ్‌గారు, ఇది తెగేట్లు లేదు, ముడిపడేట్టు లేదు. ఈరోజు ఏదో ఒకటి కావాలి..." అంటూ పక్కనె ఉన్న ఊరతనికి చెప్పిండు సర్పంచ్.

"అరే తమ్మి, అయిలయ్యను, ఆయన భార్యను, కొడుకును సప్పున రమ్మను, పంచాయితీకి వాళ్లు వచ్చింఁడని చెప్పు..."

"రెడ్డి నేను చెప్పుతానె ఉన్నా, ఏదో ఒకటి తేల్చు కోమని, దేని గురించో పిసుకులాడుతుండు పోరడు..."

"పిసుకులాడుడు ఎందుకు? ఏదో ఒకటి చెప్పక, అన్ని విధాలుగ మామ ఒప్పుకునె. ఇంకా దేని గురించి బాధ..." బాలయ్య.

"అదే అర్థంకావటం లేదు పో..." సర్పంచు తల కాయ పట్టుకుండు.

"ఈరోజు అన్ని అర్థమయిపోతాయి సర్పంచు," అనుకుంట లేచి, "అన్నా ఇప్పుడే వస్తము..." ఊర్లకు నడిచిండు బాలయ్య. ఎనుకనె రాములు, అంజయ్య, ఎల్లారెడ్డి నడిచినారు.

"తొందరగా రాంఁడి..." మంచం మీద వరుగుతూ అండు సురేందర్.

"ఇప్పుడే వస్తం..." అనుకుంట ఊర్లకు నడిచి నరు నలుగురు.

యాదయ్య, అతని కూతురు రేణుక, రేణుక చిన్నమ్మ సర్పంచు ఇంటి ముందు పంచలో కూర్చు న్నారు. ఒక్కొక్కరు చెట్టు కిందకు చేరుకుంటున్నారు ఊరోళ్లు. చెట్టు నీడన పెట్టిన జీపును చుట్టుముట్టు తున్నారు పిల్లలు. జీపెక్కబోతున్న పోరల్ని గదమా యిస్తుండు డ్రైవర్.

వేపచెట్టు అప్పుడప్పుడే ఆకురాల్చి కొత్త ఆకు లతో, వేపపూలతో వింత వాసన వేస్తుంది. ఉన్నట్టుండి వేడిగాలి అదరకొడుతుంది.

చెట్టు కింద కూర్చున్నవాళ్లను పరిశీలించ సాగిండు సురేందర్.

ఇంతకుముందు చూసినట్టుగానే అవే పీక్కు పోయిన ముఖాలు, ఎవరి ముఖంల గింత సంతోషం గాని, గింత కళగాని కనిపించటం లేదు. 'ఎందుకు బతుకుతున్నామా, ఎవరి కోసం బతుకుతున్నామా?' అన్నట్టుంది వాళ్ల పరిస్థితి.

మొదటిసారి వూర్లకు వచ్చినపుడే అర్థమయింది ఊర్ల జనం పరిస్థితి. ఇంటికొకరైన కనిపిస్తుంఁడు వింత జీవులు. వొల్లు జలదరించినట్టయింది. ఫ్లోరోసిస్ ప్రభావం ఇంత గోరంగ ఉంటుందాని మొదటిసారి అర్థ మయింది. పేపర్ల రోజు చదువుడేగాని ఇంత ప్రత్యక్షంగా చూసింది లేదు. జిల్లాలో ఎక్కువ ఫ్లోరిన్ ఉన్న ఊర్లల్లో ఇదొకటి.

తన ప్రాంతంలో ఫ్లోరిన్ ఉందని తెలుసు. ఇంత తీవ్రంగ లేకున్న ఏదో సమస్యతో బాధపడుతున్నవారే ప్రతి ఒక్కరు.

కాని రేణుక విషయం అర్థంకావటం లేదు. ఎంత ఆలోచించినా, ఈ పోరన్ని విడిచిపెట్టనయినా పెడతా గాని, ఈ ఊర్ల సంసారం చేయనని మొండిపట్టు పట్టడం. రేణుక తండ్రిని అడిగిండు, తల్లిని అడిగిండు. వాళ్లు ఏం చెప్పలేకపోతున్నారు. గట్టిగ అడిగితే పోరి ఏమన్న చేసుకుంటుందని బయం. బిడ్డ ఇష్టప్రకారం చేయాలనుకుంటుండు తండ్రి. అది కంటి ముందున్నా చాలు అనుకుంటున్నారు.

పోని రేణుక భర్తతో మాట్లాడితే ఏదన్న విషయం బయటపడతదేమో? అసలు పంచాయితి ఎటు మలుపు తిరుగుతుందో? ఈరోజు కాస్త జాగ్రత్తగానే ఉండాలి, పంచాయితిల...

''అగో అయిలయ్య, ఆయన కొడుకు వస్తుండ్రు...'' ఎవరో అనటంతో ఆలోచనలు ఆగినయి సురేందర్‌కు.

అయిలయ్య సక్కగా వచ్చి, ''బాగున్నారా సర్పంచ్‌గారు?'' సురేందర్ చేతిలో చేయి కల్పిండు.

అయిలయ్య కొడుకు రమేష్ జీపు పక్కనే నిల బడిండు. సర్పంచ్ ఇంటి ముందు కూర్చున్న రేణుక, మామ వైపు చూసింది. భర్తను చూసి రేణుక తల దించు కుంది.

ఇంట్ల నుండి హడావుడిగా బయటకు వస్తున్న సర్పంచ్‌ను ఆపి చెవులో ఏదో చెప్పిండు యాదయ్య.

''అట్లనె... అట్లనె...'' అనుకుంట నవ్వు ముఖం తో వచ్చి సురేందర్ పక్కన కూర్చుండు.

ఈ వూర్ల మొత్తం బహుశా ఈ సర్పంచు ముఖం లోనే కాస్త నవ్వు కనిపిస్తున్నట్టు అనిపించింది సురేందర్‌కు.

''ఏంది అయిలయ్య మామ, ఏదో ఒకటి తెగాలి ఈరోజు. నాంచుడు ఏంది? ఎన్ని రోజులని ఇట్ల తిరుగు తారు వీళ్లు?'' కాస్త కోపంగానె మొదలు పెట్టిండు ఆ వూరు సర్పంచ్.

ఈ మాటల్తో నిశ్శబ్దంగ మారింది అక్కడి పరిస్థితి. జీపు దగ్గర నిలబడ్డ రమేష్ బయంతో చెట్టు పక్కకొచ్చి నిలబడ్డడు. జీపు పక్కల ఇద్దరు ముగ్గురు పిల్లలు గోల చేస్తుంటే తరిమి కొట్టినరు ఊరోళ్లు. ఆ పోరలు దగ్గర్లో ఉన్న ఇంకో చెట్టుకిందికి ఉరికినారు.

''చెప్పు అయిలయ్య మామ, ఏం చేద్దాం?'' ఈసారి నెమ్మదిగా ఉచ్చు బిగిస్తున్నట్టుగా అండు సర్పంచ్.

ఆ మాటతో దూరంగ ఉన్నోళ్లంతా దగ్గరకు వచ్చినారు. ముసలోల్లు, నడిమివాళ్లు కిందని అట్లని కూర్చున్నారు. కాస్త సర్పంచ్‌కు దగ్గరోల్లు వచ్చి ఆయన పక్కని మంచం మీద కూర్చుంటున్నారు. దీని గురించి తెలిసినోళ్లు ఏం జరుగుతుందో చూద్దామని ఒక్కొక్కరు వస్తూనే ఉన్నారు. ఒకరిద్దరు రమేష్ దోస్తులు అతని పక్కనే నిలబడ్డరు.

సురేందర్ ఆడ కూర్చున్నవాళ్లను, వస్తున్నవాళ్లను మార్చి మార్చి చూడసాగాడు. ఎవరన్న అయిలయ్య వైపు గట్టిగ మాట్లాడేటోళ్లు, కనీసం నిలబడేటోళ్లు కనిపిం చడం లేదు. ఇంతకుముందు వచ్చినపుడు అయి లయ్య బంధువులు ఒకరిద్దరు గట్టిగ మాట్లాడినరు. వాళ్లు ఇప్పుడు సప్పుడు లేకుంట కూర్చున్నరు.

''... నేను చెప్పేది ఏముంది మీరే ఎట్ల న్యాయ మనిపిస్తే అట్ల చేయుండ్రి,'' సర్పంచు వైపు చూస్తు అండు.

''చూడు అయిలయ్య మామ, ఇంతకుముందు పంచాయితీలో ఇనకపోతిరి, ఎటు తేలకపాయే, ఇపుడన్న ఇంటరా?'' గట్టిగ అడిగిండు సర్పంచు.

''నేను ఇనుడు ఏంది, అది వాడిష్టము, వాన్ని గూడ అడగండి,'' కొడుకు మీద పెట్టిండు అయిలయ్య.

''చూడురా అల్లుడు, మీ నాయన నీ మీద పెడు తుండు. మేము చెప్పినట్లు ఇంటరా మరి?'' ఊరి ప్రజల వైపు చూసుకుంట రమేష్‌కు చెప్పిండు.

''చెప్పండ్రి ఇంటా...'' చాలాసేపటికి అండు నెమ్మదిగా.

సర్పంచు ఏం చెప్పుతాడో, రమేష్ ఇంటడా లేదాని? ఆత్రుతగా ఉంది, ఏం జరుగుతుందోనని ఆడ కూర్చున్నాళ్లకు.

రేణుక తండ్రి గూడ నెమ్మదిగ వచ్చిండు చెట్టు కిందకు. ఊర్లకు పోయిన బాలయ్య, రాములు, ఎల్లా రెడ్డి, అంజయ్య అప్పటికే వచ్చి కూర్చున్నారు. అందరి చేతులలో నీళ్లప్యాకెట్లు ఉన్నాయి.

విషయం చెప్పే ముందు సురేందర్‌తో ఏందో నెమ్మదిగా మాట్లాడి మొదలుపెట్టిండు సర్పంచ్.

''చూడురా అల్లుడు. నీమీదగాని, మీ కుటుంబం మీదగాని నాకేమీ కోపం లేదురా. ఇదేదో నేను చేస్తు న్నట్టు అనుకునేవు. ఆ వూరు పెద్దమనుషులు చెప్పింది

నేను చెపుతున్న... నీవు బతికెటందుకు మీ మామ వాళ్ల ఊరికి పోవాలి. ఆడనైతేనె నీ భార్య సంసారం చేస్త దంట, కాదంటే విడాకులు ఇవ్వమంటున్నారు...'' నెమ్మదిగా మూడు ముచ్చట్ల చెప్పి అయిలయ్య వైపు చూసిండు.

ఒక్కసారిగా అక్కడి వాతావరణం వేడెక్కినట్ట యింది. పైగా చెట్లగాలి ఆగిపోయింది. ఏమి చెపుతారో విందామని మాటిమాటికి అటు యిటు అయిలయ్య వైపు, ఇటు రమేష్‌వైపు చూడసాగింఁడ్రు జనం. ఇద్దరు తలకిందులకేసి ఆలోచిస్తున్నారు.

''మాట్లాడవేంది అయిలయ్య మామా...''

''నేనేం చెప్పుత వాడి బతుకు, వాడి ఇష్టం. వాడ్ని చెప్పమను...'' తిరిగి కొడుకు మీదకు నెట్టిండు.

రమేష్‌కు లోపల మంట పుట్టినట్టయింది నాయన మీద. చాలారోజుల నుండి ఆలోచించి నిన్న రాత్రే చెప్పిండు ఇంట్లో. తను చెప్పింది చెప్పట్లేదంటే తను ఈ వూరి నుండి పోవుడు ఆయనకు ఇష్టం లేన ట్టుంది. పోని ఊర్ల ఉండి బతుకుదామంటే రేణుక సంసారానికి రాదు. వదిలిపెడదామంటే మళ్లా పెండ్ల యితదా తనకు? అసలు ఈ వూరంటే ఎవడైన పిల్ల నిస్తడా? భయమేసింది రమేష్‌కు. ఈ వూరు ఇడిచిపెట్టి పోవాలంటే బాధగానే ఉన్నా ఈడుండి బతుకుడంటె రోజురోజుకు చావుడే...

''చూడు సర్పంచు, పిలగాన్ని ఆడికి పంపియ్య మంటున్నారుగ, పంపిస్తంగాని, ఆ పిల్ల ఈడికి ఎందుకు రానంటుందో చెప్పమనుండ్రి? ఎవరు ఈ ఊళ్లో సంసారం చేయట్లేదా?'' అయిలయ్య దగ్గర బంధువు మర్యాదగా అడిగిండు.

''ఆయన అడిగింది బాగనే ఉంది. ఓసారి ఆ పిల్ల నొచ్చి చెప్పమనుండ్రి...'' ఊర్లో ఒకరిద్దరు బలపర్చి నారు.

రమేష్‌కు కాల్లు వణికినట్టయింది. విషయాలన్నీ బయటకొస్తయేమోనని నాయన మీద కోపం వచ్చింది. ఆయన చెప్పితె అయిపోయేది ఈ గొడవంతా. ఆ ప్రశ్న అడిగిన బంధువు మీద మంట పుట్టింది. ఆయన కావా లనే ఇది అడిగిండు. ఓసారి బంధువని తనతో తన బాధలు చెప్పుకుండు. ఆయనకు తెలిసిగూడ బయట పెట్టమంటుండంటె? తన ఇజ్జత్ నలుగుర్ల తీయాలని గదా...

సురేందర్‌కు ఇదే అర్థం కావటంలేదు ఎంత ఆలోచించిన. పిలగాన్ని చూస్తే బాగనే ఉండు. పోని ఏమన్న చెడు తిరుగుళ్లు ఉన్నయా అంటే అవి లేవం టున్నరు. ఎందుకిట్ల మొండికేసింది రేణుక?

''ఏదో బలమైన కారణముంటది. తెలుసుకంది ఏ పని చేయకుండ్రి...'' ఇంటి దగ్గర భార్య అన్న మాటలు గుర్తొచ్చినయి సురేందర్‌కు.

''ఆ అమ్మాయిని ఈడికొచ్చి చెప్పమనుండ్రి?'' గుంపుల నుండి ఎవరో అన్నారు.

''ఇంతమందిలో ఏం చెప్పుతుంది?'' ఎవరో అమ్మాయి తరపున అన్నారు.

''వాళ్ల సంసారమే మందిల పడే. చెప్పితే ఏమైతది?'' ఇంతకుముందు అన్నవాళ్లు మళ్లీ అన్నారు.

దాంతో అటువైపు, ఇటువైపోళ్ల నుండి వాదోప వాదాలు మొదలైనయి. ఒకరు చెప్పితే ఇంకొకరికి విని పించలేని పరిస్థితి. కయ్యరబియ్యర అరుపులు. సర్పంచు లేచి గట్టిగ అరిచిండు.

''ఈ పంచాయితి నెమ్మదిగా కానిస్తారా, లేకుంటే ఎవ్వని ఇష్టమొచ్చినట్టు వాడు మాట్లాడుతారా...'' దాంతో కొద్దిగా గోల సద్దుమణిగింది.

''ఇగో వినుండ్రి ఇద్దరు పెద్దమనుషుల్ని పంపుదం. ఆ అమ్మాయి ఏమి చెప్పుతుందో తెలుసు కొని వచ్చి ఈడ చెపుతారు, ఏమంటారు?'' యంపిటిసి బాలయ్య చొరవ తీసుకొని ముందుకొచ్చిండు.

ఈ ఆలోచన అందరికీ నచ్చినట్టుంది. అందరూ ఒప్పుకున్నారు.

ఎవర్ని పంపాలనె దగ్గర ఆలోచన మొదలైంది. మొగోల్లను పంపితే ఉన్నది ఉన్నట్టు చెప్పుతదో లేదో? ఆడోళ్లను పంపితే దాపరికం లేకుండ అన్ని తెలుసుకొని వస్తారు. ఇట్ల ఆలోచనలు సాగుతున్నాయి ఒకవైపు.

ఇంకోవైపు ఇంటి ముందు పంచలో కూర్చున్న రేణుకకు, వాళ్ల చిన్నమ్మకు ఈ మాటలు మొత్తం గాక పోయిన కొన్నయిన వినిపిస్తూనే ఉన్నాయి. తను ఎందుకు సంసారంకు రానంటోందో చెప్పాల్సి ఉంటుం దని అర్థమైంది రేణుకకు. నెమ్మదిగా ఏడుపందుకుంది రేణుక.

''ఊర్కో బిడ్డా ఏంగాదు తియి. చెప్పు, అన్నీ చెప్పు. నీ కడుపుల ఉన్నదంత చెప్పు. బయమేంది? ఇంతదాక వచ్చింది, అయ్యేది అయితది...'' ఓదార్చ సాగింది రేణుకను వాళ్ల చిన్నమ్మ.

రేణుకకు మాట్లాడటం బయం కాదు. రమేష్ గురించి బయటపెట్టుకోవడం బాధగా ఉంది. ఎట్ల చెప్పాల్నో అర్థం కావటంలేదు. ఇంతవరకు తల్లిదండ్రు

లకే మర్మమిప్పి చెప్పలే. ఇలాంటిది పెద్దమనుషుల ముందు ఎట్ల చెప్పాలి? కాని చెప్పకుంటే ఆడ మాట లను బట్టి చూస్తే తప్పంత తనమీదికే వచ్చేటట్టుంది.

ఆ సమయంల ఎందుకో రమేష్ వైపు చూడాలని పించింది. కండ్లతో వెతికింది. చెట్టు పక్కనే నిలబడ్డడు. అతను గూడ తనవైపు చూస్తున్నట్టనిపించింది రేణుకకు. అతనితో తన బతుకు ఇంతటితో ముగుస్తుందా లేక నడుస్తుందా? అర్థంకావటం లేదు. ఎన్నిసార్లు ఏడ్సు కుంట ఉత్తరాలు రాసింది? ఫోన్లు చేసింది రమేష్‌కు. అయినా జవాబు చెప్పకపాయే.

ఉన్నట్టుండి అమ్మ మీద కోపమొచ్చింది. తను చదువుకుంటనని ఎంత మొత్తుకుంటున్న వినకుండ, 'మేనరికం ఎట్ల పోనిస్తం? మా అన్న కొడుకు, ఒక్కగా నొక్క కొడుకు. పిలగానికేమి లోటు, ఎర్రగా బుద్దుగా ఉంటడు...' అంటూ తను పదవ తరగతి పరీక్షలు అట్ల రాసిందో లేదో ఇట్ల పెండ్లయిపోయింది. అప్పటికే రమేష్ నల్లగొండలో ఇంటర్ తప్పి వ్యవసాయంకు దిగిండు, తండ్రికి తోడుగా.

"నాలుగెకరాల తరి, ఇరవైనాలుగు గంటలు పోసే బోరు, వంద జీవాలు, వాళ్లకేమి తక్కువ..." పెండ్లి కుదిరిన దగ్గర నుండి పెండ్లయి పోయేదాక అమ్మ ఎవరు కనిపించిన చెప్పే మాటలతో చెవులు గింగురు మనిపించేవి.

అవేవి అర్థమయ్యేవి కాదు రేణుకకు. కాలేజి చేయాలని అందులో బైపిసి తీసుకొని చదవాలని కోరికగా ఉండేది.

"పెండ్లయినంక గూడ సదువుకోవచ్చు. ఎంత మంది సదవట్లేదు..." అత్తామామలు గూడ అనిరి. పెండ్లయినంక తెల్సింది. తాను చదవటం వీలుకాదని. అత్తమామల సంగతేందోగాని రమేష్‌కు అసలు ఇష్టం లేదు.

సంసారానికి పోనని తాను ఏడ్వటం, మొండి పట్టు పట్టడం, 'చిన్నపిల్ల దానికేం తెల్సు...' తల్లి దండ్రులు, అటు అత్తమామలు బతిమిలాడుడు. ఇవన్నీ అయినంక పెండ్లయిన రెండో సంవత్సరం కావచ్చు, దసరా పండుగకు రమేష్ రావుడు, ప్రేమతో తీసుకపోవటం...

మేనరికం కావటం వల్ల అత్తామామలు గూడ ఏమనకపోయేటోళ్లు. ఒకటి రెండేండ్ల దాక పొలంవైపు పోలేదు. అత్తమామలు గూడ ఇంటి కాడుండి వండి పెడితె చాలుననెటోళ్లే.

నెమ్మదిగా ఆ వూరు వాతావరణానికి అలవాటు పడ్డా ఆ ఊర్ల జనం రకరకాలుగా జబ్బులతో బాధ పడడం వింతగా అనిపించేది రేణుకకు. ఒక్కోసారి బయమనిపించేది. ఈ వూరు కొచ్చిన రెండేండ్లకు కావచ్చు, నెల తప్పినట్టు తప్పి రెండో నెల కడుపుల విపరీతమైన నొప్పి. నల్లగొండకు పోయి డాక్టరమ్మకు చూపిస్తే, 'అబార్షనయింది' అని చెప్పింది. మొదటిసారి ఇట్లనుకుంటే రెండవసారి గూడ కడుపులోనే కరిగిపో యింది.

"భార్యాభర్తలు ఇద్దరూ పరీక్షలు చేయించు కోవాలి," డాక్టరమ్మ సీరియస్‌గానే చెప్పింది.

హాస్పిటల్‌కు పోదామంటే కదలడు. రమేష్‌లో గూడ విచిత్ర మార్పుల్ని గమనించసాగింది రేణుక.

మొదట్లో మనిషి దగ్గర దగ్గరగా ఉండేటోడు. అలాంటిది ఇప్పుడు దూరంగ దూరంగ ఉండాలని చూస్తుండు? మొదట్లో అనుమానమనిపించింది కాని దూరంగ ఎందుకు ఉండాలనుకుంటుండు?

"నాకు చాతనైతలేదు, బాయి దగ్గరకు రానె..." ఓరోజు అమ్మతో అండు.

"నిన్న వద్దంటే వరాలు తొవ్వి నరాలు ఏడ పట్టు కున్నయో, గోళి తెచ్చుకొని ఏసుకొని పండుకో బిడ్డా..." చెప్పి తల్లిదండ్రి బాయి దగ్గరకు పోయినరు.

మంచి సమయం దొరికినట్టయింది రేణుకకు. ఎన్ని రోజుల నుండి ఒంటరిగా మాట్లాడక, రాత్రి మాట్లాడుదామంటె పక్కనున్న గదిల నుండి అత్త మామలు ఇంటరని భయం. అత్తమామ అట్ల పొలం దగ్గరకు పోగానే ముందు తలుపులు దగ్గరేసి రమేష్ పడుకున్న గదిలకు పోయి అతని మంచం మీద కూర్చుంది.

అతను నిద్రపోతున్నాడో లేక నటిస్తున్నాడో అర్థం కావటంలేదు. నెమ్మదిగ అతని మీద చేయి వేసింది. వల్లంత చల్లగా ఉండి ఆమె చేతి స్పర్శకు కండ్లు తెరిచిండు రమేష్.

"ఏమైంది?" అతనికి దగ్గరగా జరుగుతూ అంది.

"ఏం గాలె..." దూరంగ జరుగుతాండు.

"మరి గట్లున్నవేంది?" అతని నుదురు మీద చేయి వేస్తూ అంది.

"ఎట్లున్న... బాగనే ఉన్న..." ఆమె చేతిని తీస్తూ అండు.

"దొంగోడ, బాగలేదని చెప్పినవా, మీ అమ్మా నాన్నలకు!" అతన్ని చుట్టుకుంటూ అంది.

"నాకు బాగలేదు..." రమేష్ గొణుగుతుండు.

"జొరం లేదుగా, చల్లగా ఉంది..." మరింత గట్టిగ అతని శరీరాన్ని చుట్టుకు పోసాగింది.

ఆ సమయంలో సహజంగా రావాల్సిన కోరికలు రావటం లేదు రమేష్‌కు.

మరోవైపు రేణుక పెనుగులాట.

"ఎన్ని రోజులని తప్పించుకొని తిరుగుతావు? రాత్రంటె మీ అమ్మనాన్నల భయం, ఇప్పుడేమైంది..." ఏదో గొణుగుతుంది.

ఏ మగాడికి రాకూడని పరిస్థితి అది. రేణుకను బలవంతంగా విడిపించుకొని లేచి నిలబడిండు. రేణుక బిత్తరపోయింది రమేష్ ప్రవర్తనకు. ఆ సమయంల భార్య ముఖం చూడాలంటేనే సిగ్గనిపించింది. ఒకవైపు బాధ, ఇంకోవైపు అవమానం, తన పరిస్థితికి కారణ మేందో అర్థంకాక, అయోమయంలో ఇంట్ల నుండి బయటకు వచ్చిండు.

'తనకు ఎందుకు ఇట్లయింది?' ఆలోచనలతో, ఆందోళనతో రెండు మూడు బజార్లు తిరిగి స్నేహితు నింటికి పోయిండు.

"ఏంది గట్లున్నావు?" రమేష్‌ను గుచ్చిగుచ్చి అడిగిండు ఆ స్నేహితుడు.

రమేష్ ఏం చెప్పకుండ మౌనంగా ఉండు.

"ఇంట్ల గొడవలు జరిగినయా?"

దేనికి సమాధానం చెప్పలేదు.

"చెప్పకుంటెమానె తియ్," రమేష్‌ను తీసుకొని తాళ్లల్లకు పోయిండు ఆ స్నేహితుడు.

ఎప్పుడు లేంది రెండు బుడ్ల కల్లు గటగట మింగిండు రమేష్. ఆ నిషాలో తన బాధనంతా వెళ్ల గక్కుకుండు స్నేహితుడికి.

"నాగ్గూడ అట్లనె అయితది అప్పుడప్పుడు..." రమేష్‌ను ఓదార్చి నల్లగొండలో ఏ డాక్టరు దగ్గర మందులు తెచ్చుకున్నాడో చెప్పిండు.

తెల్లారి వెంటనే నల్లగొండకు పోయి డాక్టరు దగ్గర ఆయుర్వేద మందులు తెచ్చుకున్నాడు.

అవి వాడినప్పుడల్లా బాగనే ఉన్నట్టుండేది. మందులు అయిపోయినంక ఒకటి రెండు నెలల తర్వాత మళ్లా మొదటికొస్తది సమస్య. మందులు మింగి మింగి విసుగొస్తుంది రమేష్‌కు.

మరోవైపు తనకే జబ్బో దాచలేక, అటు అమ్మ నాన్నలకు ఇటు భార్యకు చెప్పలేక ప్రాణం మీదికి వస్తుంది.

రమేష్ పరిస్థితి అర్థంకాక విచిత్రంగా ఉందంటే, పూర్ల పరిస్థితులు అంతకంటే విచిత్రంగా బయంగా ఉన్నాయి.

తనతోపాటు పెండ్లయిన స్నేహితురాలు కన్న దంటే చూడటానికి పోయింది రేణుక. పుట్టిన పోరన్ని చూసేసరికి బయమేసింది రేణుకకు. పెద్ద తలకాయ, పొడుగాటి కాళ్లు, చేతులు లేకుండ దెయ్యంలాగుండు. పిలగాన్ని చూసుకుంటు ఏడుస్తున్న స్నేహితురాలని ఓదార్చబోయింది.

"రేణుక ఈ పూర్ల ఉండి సంసారం చేసి పిల్లల్ని కనొద్దే. ఈ పూర్ల నీళ్లు తాగినోళ్లకు ఇట్లనె పిల్లలు పుడత రంట. ఈ పూర్ల నీళ్లు అటువంటివంట. హాస్పటల్లో చెప్పిండ్రు డాక్టర్లు. వద్దంటుంటే మా నాయన ఈ పూరి కిచ్చి చేసిండు..." మొగుని ముందే ఏడుపు అందు కుంది.

స్నేహితురాలి మాటలేమిటోగాని ఆ పిలగాన్ని చూసిన దగ్గరి నుండి లోపల బయం పట్టుకుంది రేణుకకు. తనకు రెండుసార్లు గర్భం పడిపోయే. నీళ్లకు దానికి ఏమన్న సంబంధం ఉందా? తనకు పుట్టె టోళ్లు ఎటువంటోళ్లు పుడతారో... తనకు కాళ్లు లేనోడు పుట్టినట్టు ఓరోజు కలొచ్చింది. అప్పటి నుండి మరింత భయం పెట్టుకుంది. అటువంటి కలలతో, భయాలతో నెలరోజుల దాకా రమేష్ దగ్గరికే పోలేదు. అతను దూరంగానే ఉండు.

దసరా పండుగకు ముందు యాదయ్య వచ్చి రేణుకను తీసుకపోయిండు. అప్పటి నుండి మొండికేసి తల్లిగారింట్లనె ఉంది...

... ఇప్పుడు ఇదంత చెప్పాల్నా వద్దాని సంఘర్షణ మొదలైంది రేణుకకు. చెప్పకుంటే తను తప్పుల పడేట ట్టుంది. చెప్పితే రమేష్ గురించి బయటపెట్టినట్టయి తది. ఇట్ల ఆలోచనలో సతమతమవుతున్న రేణుకకు పంచాయితి జరుగుతున్న దగ్గర నుండి రమేష్ గొంతు పెద్దగా వినిపించింది.

"నేను మామ ఇంటికే బతికేతందుకు పోతా, ఈడ ఉండను, నా భార్యను అడిగేది ఏంలేదు..." కోపం లో చెప్పి గబగబా అక్కడి నుండి పోయిండు.

"నా కొడుకు ఆడికే పోతనంటుండు. ఎవర్నీ ఏమి అడుగుడు లేదు, గిడుగుడు లేదు. అయ్యా సర్పంచు గారు నా కొడుకు మీ పూరికే వస్తాడు. ఊర్ల వాడి బతుకు ఎట్లనో మీరే ఆలోచించండి బిడ్డా..." రమేష్ తల్లి సురేందర్‌కు దండం పెడుతూ ఏడ్చుకుంటూ కొడుకు వెంటపోయింది ఇంటికి.

తల్లికొడుకుల మాటలలో అక్కడి వాతావరణం నిశ్శబ్దమైంది. ఇంత త్వరగా అయిపోతదని అనుకోలేదు. యాదయ్యకు ఏదో బరువు దించినట్టయింది.

పంచాయితీ ముగింపు పిదప ఆ వూరి ప్రజల మాటల్ని ముఖకవళికల్ని జాగ్రత్తగా పరిశీలించసాగిండు సురేందర్.

ఈ సంఘటన వాళ్లనేమి విచిత్రంలో పడేటట్టు చేయలేదు. పైగా రమేషేదో పీడను నెట్టుకొని పోతుండు అన్నట్టున్నాయి వాళ్ల మాటలు.

"వాడిష్టం ఏడన్నా బతకనీయి. సుఖంగ బతికితే చాలు. వాళ్లమ్మ చెప్పినట్టు వాడి బతుకు గురించి ఎట్లనో ఆలోచించండి..." సురేందర్ వైపు, వియ్యంకుని వైపు చూస్తూ అండు అయిలయ్య.

వియ్యంకుడు ఏదో సమాధానం చెపుదామను కుంటుండగానె బాలయ్య అందుకునేసరికి ఆగిపోయిండు.

"ఇగో పెదనాయన, నీ కొడుక్కి ఏమి లోటు లేదు. మీ వియ్యంకునికా ఒక పోరడు, ఒకే కూతురు. పోరడు చిన్నోడు. వాడు పెరిగి పెద్దయేసరికి పది, పదిహేను ఏండ్లయితది. అప్పటిదాక నీ కొడుకు మామిం ట్లనె ఉండుడు. మీకెట్ల వ్యవసాయం ఉందో అంత కంటె ఎక్కువనె ఉంది వాళ్లకు, జీవాలున్నాయి, ఏం గాదు మంచిగనే బతుకుతరు..." బంధుత్వం ఉండటం వల్ల అయిలయ్యకు చెప్పకపోయిండు బాలయ్య.

"అదిగాదు బిడ్డా..." ఏదో అడగబోయిండు అయిలయ్య.

వియ్యంకుని అనుమానం అర్థం చేసుకున్న వాడిల యాదయ్య అండు.

"నాకు కొడుకు బిడ్డ ఇద్దరు సమానమే. పోరడు పెద్దయ్యేదాక ఇంట్లో ఉంటే సగం ఆస్తి, లేదంటే రెండె కరాల తరి ఇస్త చేసుకోమను."

"ఖాళీస్థలం మస్తుగుంది ఆయనకు. వెళ్లినంక ఇల్లుగూడ కట్టిస్తము తీయి," యాదయ్య వదిలి పెట్టింది బాలయ్య పూర్తి చేసిండు.

అయిలయ్యకు ఏం మాట్లాడాలో అర్థంకావటం లేదు. ఊరోళ్లకు ఈర్ష్యగా ఉన్నట్టుంది రమేష్ అదృష్టానికి.

అందరు లేచిపోయే ముందు చివరి మాటగ అండు యాదయ్య.

"కొడుకును విడదీసిన్నని బదనాం కావద్దు? మా వియ్యంకుడు, చెల్లి గూడ ఈడి పొలం పుట్ర అమ్ము కొని వస్తే మరీ మంచిది, ఇల్లు గూడ కట్టిస్త మా వూర్లో..."

అయిలయ్య అనుమానాలు తీరినయి. పంచాయితీ ఎట్లయితదోనని బయపడ్డ అయిలయ్యకు మనసు తేలికైనట్టయింది. కొడుకు పోరు పెట్టిన దగ్గరి నుండి అయిలయ్యకు గూడ అనిపిస్తుంది ఈ వూరు వదిలిపెట్టిపోవాలని. మొత్తంమీద మంచిగనే అయింది. ఆ సంతోషంలో యాదయ్య దగ్గరకు పోయి చేయి పట్టుకొని,

"రా బావ ఇంటికి పోదం..." బతిమిలాడిండు. పోవాల్నా వద్దాని సంశయంలో పడ్డడు యాదయ్య.

"తుషా, పరాయోళ్లా పక్కవోళ్లా? ఒక్క బావని పిలుస్తున్నావు. కోడల్ని, బంధువుల్ని వచ్చినోళ్లనందరిని ఇంటికి తీసుకపో చెడ్డముఖపోడా..." వరుసకు అత్తయ్యే నర్సమ్మ అయిలయ్యను తిట్టింది.

"మీరు గూడ రాండ్రి ఇంటిదాక..." నర్సమ్మ భయానికి అందర్నీ పిలిచిండు.

"అందరు వస్తరుగాని, కోడి కొయి పో...!" నవ్వుతూ అండు ఆ వూరు సర్పంచ్.

"ఎంతసేపట్లో కోస్తా..." ఇంకా ఏదో అనబోయి భార్య ఏడుపు విని ఆగిపోయిండు అయిలయ్య.

సర్పంచు ఇంటి ముందు కోడలు చేతులు పట్టుకొని ఏడ్వసాగింది రమేష్ తల్లి. రేణుకకు గూడ కన్నీళ్లు ఆగటం లేదు.

"ఊకో ఒదిన..." రేణుక పిన్ని ఓదార్చసాగింది.

"కోడల్ని ఉంచి పోండి బావ..." యాదయ్య చేతులు పట్టుకుండు వియ్యంకుడు.

యాదయ్య అర్థంకాక సురేందర్ వైపు చూసిండు.

"ఏమైతది ఉంచు..." ఇద్దరు సర్పంచులు అన్నారు.

"ఉంచుతగాని ఎల్లుండి పంపండి..." తమ్ముని భార్యను గూడ ఆడ ఉండమని చెప్పిండు.

ఇద్దరిని ఇంటికి తీసుకపోయింది రమేష్ తల్లి.

"మొత్తంమీద పంచాయితి ఏ గొడవలు లేకుండ అయింది సర్పంచుగారు..." సంతోషంతో అండు ఆ వూరు సర్పంచు.

"ఏదో మీరు శ్రమ తీసుకోబట్టి అయింది..." కృతజ్ఞతగా ఆ ఊరి సర్పంచు చేయి పట్టుకుంటు అండు.

"అయ్యో దానిదేముంది రెడ్డి. ఏదన్న మంచి చేయాలిగాని చెడు చేయొద్దు..."

"మేము పోయొస్తం సర్పంచుగారు..." వూరు సర్పంచు దగ్గర వీడ్కోలు తీసుకుంటు అండు

సురేందర్. జీపు ఎక్కాల్సినోళ్లందరు జీపు దగ్గరకు నడిచినారు.

''అయ్యో, ఏదన్న తయారుచేయించకపోతి, తినన్నపోదురు...'' మాట వరుసకు అన్నడుగాని, అంత మందికి తయారు చేయించుడు తన శక్తికి మించిన పనని తెలుసు.

''ఫర్వాలేదు సర్పంచుగారు, ఎంతసేపుల పోతం, రెండు గంటల్లో ఇంట్ల ఉంటం, దార్ల ఏడనన్న తింటం తీయి...'' అందరికి కడుపుల మండుతున్న ఆపుకుంటు న్నారు.

అందరు జీపుల కూర్చుంటే తను గూడ ఎక్క బోయి ఏదో యాదికొచ్చినవాడిలా సురేందర్‌తో అండు, ''అయ్యా ఇప్పుడే వస్తా...'' అంటూ గబగబా బిడ్డింటికి పోయిండు.

అట్లపోయి కొద్దిసేపట్లోనె తిరిగి వచ్చి సురేందర్ తో అండు.

''అయ్యా బిడ్డ ఏడుస్తుంది. నన్ను గూడ ఉండ మని, మీరు పోండి రేపొస్తం...'' దారి ఖర్చులకని అయి దొందలు తీసి బాలయ్య చేతిలో పెట్టిండు.

''ఎందుకు తీయి... ఎందుకు తీయి...'' అను కుంటెనె యాదయ్య ఇచ్చిన డబ్బుల్ని జేబుల పెట్టు కుండు బాలయ్య.

జీపు ఊరు దాటి అయిదారు కిలోమీటర్లు వచ్చింది. తాటివనం మొదలయింది. గౌళ్లోల్లు చెట్టు మీద నుండి కల్లు దించుతున్నారు. ఆడోళ్లు గిరాకిని చూసుకుంట కల్లు పంచుతున్నారు.

ఈ తాటివనం రెండు మూడు ఊర్లకు కేంద్రంగా ఉన్నట్టుంది. పైగా రోడ్డు మీద నుండి వచ్చేపోయేటోళ్ల సందడిలో గౌళ్లోల్లకు గిరాకీ గూడ బాగనే ఉన్నది.

''జీపు ఈడ ఆపు...'' వో పెద్ద మర్రిచెట్టును చూసుకుంట అండు బాలయ్య.

జీపు ఆగిందో లేదో ఓ గౌడు భార్య వచ్చి ''కల్లుంది సార్, రండి...'' బతిమిలాడసాగింది.

''అందుకే గదమ్మా ఆగింది...'' బాలయ్య దిగు కుంటనే అండు.

అందురు దిగి మర్రిచెట్టు కింద కూర్చున్నారు. పాణం లేచొచ్చినట్టయింది చల్లటి గాలికి.

అదే చెట్టుకింద మూడు నాలుగు పట్వాల నిండ కల్లుంది. బుసబుసమంటూ పొంగసాగింది కల్లు.

''కల్లు ఎంత కావాలి సారు...'' ఆ గౌడు భార్య మళ్లీ అడిగింది.

''కల్లు మంచిగుందా...'' రాములు.

''ఏ కుండలది కావాల్నో సయి చూసుకోండి సార్...''

''అరె రాములు, అన్ని కుండలది సయి చూడురా, నీవైతెనె బాగుంటది...'' ఎల్లారెడ్డి.

మర్రి ఆకు తెచ్చి రాములు చేతిల పెట్టి ఒక్కొక్క కుండల కల్లు గింత పోయ సాగింది గౌడు భార్య.

''ఇది ఎట్లుందిరా?'' మొదటి కుండలది రుచి అడిగిండు ఎల్లారెడ్డి.

''ఏ తియ్యగుంది...'' రాములు.

''ఇదెట్లుందిరా?'' రెండో కుండలది తాగినంక.

''పుల్లగుంది...''

''దీంట్ల ఎట్లుంది?'' మూడ కుండలది అడి గిండు.

''సప్పనాదుంది...'' అనుమానంలో మళ్లాసారి పోయించుకొని తాగిండు రాములు.

''ఇది బాగనే ఉంది...'' మూడో కుండల కల్లుకు అంగీకారం తెల్పిండు రాములు.

ఎల్లారెడ్డికి అనుమానమొచ్చి మల్లోసారి మూడో కుండల కల్లు రుచి చూసిండు. రాములు చెప్పినట్టు మూడో కుండ బాగనే ఉంది కాని సురేందర్‌కు ఇటు వంటి కల్లు పడదు, అదే అన్నడు.

ఈ కల్లు మనం తాగుతాం గాని, సురేందరన్న తాగలేడు...

''అంత గట్టిగ ఉందా?'' అంటూ కుండల కల్లు చేతుల తీసుకొని రుచి చూసి తల విదిల్చి అండు బాలయ్య.

''నిజమేనె సురేందరన్న, ఈ కల్లు నీవు తాగ లేవు...''

''చూడమ్మ మొదటి కుండల ఉన్న కల్లు మా సర్పంచుకు వంచు, ఈ పట్వా మాకు వంచు...'' అప్పుడే బుడ్డి కల్లు తీసుకొని వచ్చిన గౌడుకు రేఖలు కట్టమని పురమాయించిండు ఎల్లారెడ్డి.

అందరు ఆకలి, దూప మీద ఉన్నట్టున్నారు. ఒక్క దమ్ములోనే సగం పట్వ కాలి చేసింర్రు అందరు.

జీపు పక్కనే సురేందర్, బాలయ్య, రాములు, ఎల్లారెడ్డి, అంజయ్య, చివర్లో డ్రైవర్ గౌస్‌మియా వరుసగా కూర్చున్నారు.

రెండో దమ్ము పట్టినంక అందరి కడుపులు చల్లపడ్డట్టున్నాయి.

అప్పుడే ఓ నడీడుపామె బుట్టతో వచ్చి సరిగ్గా బాలయ్య, సురేందర్ ముందు దించింది. బుట్టలోని

వాసన అందరికీ ముక్కుపుటాలకు తాకింది. ఆ బుట్టలో బజ్జీలు, అప్పడాలు, అప్పలు, ఉలువలు, చెనుగలు, పల్లీలున్నాయి.

"ఇప్పుడే చేసుకొని వస్తున్న సారు..." ఓ బజ్జీని బాలయ్య చేతిలో పెట్టింది బుట్టామె.

"వేడిగానె ఉన్నట్టుంది..." బజ్జీని కొరుక్కుంటనే బుట్టలో ఇంకా ఏమేమి ఉన్నయో వెతుకసాగిండు బాలయ్య.

"ఎవరికి ఏమి కావాలో అడిగిపెట్టు," ఎల్లారెడ్డి అన్నాడు.

బుట్టల ఉన్న పేపర్లు తీసి ఎల్లారెడ్డి చెప్పినట్లు ఎవరికి ఏమి కావాలో అడిగి పెట్టింది. మొత్తం లెక్క చూసుకొని, "ఇప్పుడే వస్త సారు..." చెప్పి ఇంకో అడ్డ దగ్గరకు పోయింది.

"ఏ వూరు బాలన్న ఇది, గిట్లున్నది?" ఆశ్చర్యం గా అడిగిండు ఎల్లారెడ్డి.

"ఏ వూరు...?" అర్థంగాక నోట్ల ఉలవలు ఏసు కుంటు అండు.

"అదే మనం పోయిన వూరు. ఎవరింట్ల చూసిన ఎవరో ఒకరు రోగంలో ఉన్నట్టున్నారు. చేతులుంటె కాళ్లుండవు. కాళ్లుంటె నడువులుండవు. పండుకునే టోడు పండుకున్నట్టె ఉండుడు. కూర్చున్నోడు కూర్చు న్నట్టె ఉండుడు, ఏందీ మనుషులు, ఏందీ రోగాలు..."

"ఈ వూరుకొచ్చుడు నీకు మొదటిసారిగదా, గట్టనె అనిపిస్తది తీయి! మొదటిసారి పంచాయితీకి వచ్చినపుడు రాములుకు, అంజయ్యకు ఏమైందో తెలుసా" మిర్చి బజ్జీని కొరుకుతు అండు బాలయ్య.

"ఏం ఊరో మా చెప్పినవుగాని..." కోపంతో చెనగలు నోట్ల ఏసుకుంట అండు.

"ఏందో చెప్పు...!" ఎల్లారెడ్డికి ఆత్రుత ఆగటం లేదు.

నవ్వుకుంటు మొదలుపెట్టిండు బాలయ్య.

"...మొదటిసారి పంచాయితీకి వచ్చినపుడు మాకేం తెల్సు, తెలువక ఈవూర్ల నీళ్లు తాగినం. ఎంత తాగిన దూపారటం లేదు. ఆడికి నేను సురేందరన్న పోయి కూల్ డ్రింక్స్ తాగినం. ఈ రాములు, అంజిగాడు దూప దూపంటు చెంబులకు చెంబులు నీళ్లు తాగినరు. ఇగ సూడు సాయంత్రం అయ్యేసరికి ఇటు మూత్రం మంట, అటు దొడ్డికి. వీళ్ల బాదలు చెప్పతరం గాదు! వచ్చేటపుడు చౌటుప్పల్‌లో డాక్టరుకు చూపించు కున్నంక ఆ బాధ తగ్గింది. ఇగో అప్పటి నుండి ఈ వూరికస్తే ఆ వూర్ల నీళ్లు ముట్టరు...!"

"గిదేంది గాని ఎల్లారెడ్డి, మనం దుకాణం దగ్గర పాకెట్ల నీళ్లు తాగేటప్పుడు ఆడ ఓ పోరడు కూర్చున్నడు గుర్తుంది గదా!"

"అవును గుర్తుంది..."

"ఆ పోరనికి ఎంత వయస్సు ఉంటదంటవు?"

"ఉండొచ్చు పదిహేనో, పదహారు ఏండ్లు."

"అతను పోరడుగాదు, నలభై ఏండ్లకు పైగుం టయి. అతను నీళ్లవల్ల అట్లున్నడు..." రాములు.

"నిజంగన..." ఆశ్చర్యంతో నోరు వెల్లపెట్టిండు ఎల్లారెడ్డి.

రాములు మాటలో ఆ వూరు గురించిన ఆలో చనల్లో పడ్డడు సురేందర్.

... తను గూడ ఈ వూరికి మొదటిసారి వచ్చి నపుడు నిజంగానే ఆశ్చర్యపోయిండు. ఒక జిల్లాలోనే ఒక మూలకు ఇంకో మూలకు ఇంత వ్యత్యాసమా? అసలు వీళ్లు తమ జిల్లా వాళ్లేనా అనిపించింది. తన ప్రాంతంలో ఫ్లోరిన్ ఉంది, కాని ఇంత తీవ్రంగా దయ నీయస్థితిలో లేదు.

ఒకతను పధ్నాలుగు సంవత్సరాల నుండి మంచం మీద నుండి లేవకుండ బతుకుతుండు. అతన్ని లేబడదామని ఎవరన్న ప్రయత్నించిన బొక్కలు ఇరుగుతున్నాయని మొత్తుకోబట్టె. ఇంకొకతను అతని కాళ్లు నడుము ఎటు తిప్పితే అటు పాము తోకల్లా తిరగ బట్టె. ఇరవై ఏండ్ల యువకుడు పండుముసలోని లెక్క కనిపిస్తే, పండు ముసలోడు పోరని లెక్క కనిపించుడు, చిత్రవిచిత్రమైన లోపాలు, అంతుపట్టని రోగాలు, అక్కడి పరిస్థితులు చూస్తుంటే బయమేస్తుంది...

"ఇట్ల ఎందుకు పుడుతున్నారో తెలుసా? ఫ్లోరిన్ నీళ్ల వల్ల. పోయిన నెలలో మండల కేంద్రంలో 'సాయి ఫౌండేషన్' వాళ్లంట, మీటింగు పెట్టిను. అప్పుడు సురేందరన్న ఊర్ల లేడు. నేను పోయిన ఆ మీటింగ్‌కు. ఆడ డాక్టర్లు చెబుతున్న విషయాలు వింటుంటే ఈ జిల్లాలో బతుకుడు దండగనిపిస్తుంది..." చెప్పి రెండు శనగిత్తులు నోట్ల ఏసుకున్నాడు బాలయ్య.

"ఎందుకన్నా," ఆత్రుతతో అడిగిండు రాములు.

"ఎందుకేంది, ఈ నీళ్లు తాగటం వల్ల జీర్ణకోశం దెబ్బతినుడు, కడుపునొప్పి, ఉబ్బరం, వాంతులు, ఆకలి లేకపోవడం, విరేచనాలు, దొడ్డిలో రక్తం పడుడు. ఎముకల జబ్బులు, నరాల జబ్బులు, శ్వాసకోశ జబ్బులు, అలర్జీలు..."

''ఏహే ఊర్కో, నీవు చెప్తుంటే ఆ జబ్బులన్నీ నాకు ఉన్నాయనిపిస్తుంది పాడుగాను...'' రాములు అట్ల అన్నాడో లేదో,

''ఏహే నీ కొక్కనికే గాదు, మనూర్ల మెడ నొప్పులు, మోకాళ్ల నొప్పులు, నడుమ నొప్పులు, పాదాల నొప్పులు, గుర్రం మూతులు లేనోడు ఎవడైన ఉంటే చెప్పుతో కొట్టు...'' ఎల్లారెడ్డి అందుకున్నాడు.

''ఈ నొప్పులు పాడుగాను. టీవీల చూసి మూవ్‌లని, ఆర్థోపిట్‌లని, జైంటీస్‌లని, అవని ఇవని ఎన్ని రాసిన తగ్గినట్టె తగ్గి మళ్లా నొప్పులు వస్తనె ఉండె... ఇవి ఎట్లు తగ్గుతయో ఏం పాడో?'' బాధగా అన్నాడు రాములు.

''ఎముక లోపల గట్టిగ లేకుండ పైన ఎంత రాస్తే ఏమొస్తది? ముందు బొక్కల్లోకి ఫ్లోరిన్ పోకుండ చూసుకోవాలి...'' బాలయ్య.

''బొక్కల్లోకి ఫ్లోరిన్ పోకుండ ఏం చేయాలి?'' రాములు.

''ఏం చేసుడు, ఏ మంజీరా నీళ్లో, కృష్ణా నీళ్లో, ఫిల్టర్ నీళ్లో తాగాలి...'' బాలయ్య.

''గదే కొనుక్కొని తాగెటోన్ని అయితే గిట్లుండునా? పాడుగాను...'' గౌడు భార్య కల్లు వంచుతా ననటంతో రేఖ నోట్ల పెట్టుకుండు రాములు.

ఆ మాటలు వింటుంటె మూడేండ్ల కింద తన కొచ్చిన బాధ గుర్తొచ్చింది సురేందర్‌కు.

బాగా పనుల కాలం, ఉన్నట్టుండి ఓ రోజు పొలంల ట్రాక్టర్‌తో దున్నుతుంటే నడుము పట్టేసినట్టయింది. నిలబడితే కూర్చోరాదు, కూర్చుంటే నిలబడరాదు. పగోనికైనా రావద్దు అటువంటి బాద. ట్రాక్టరు నడపడం వల్ల వచ్చిందనుకుని ఎప్పటిలాగే మండల కేంద్రంల ఉన్న డాక్టరు మిత్రుని దగ్గరకు పోయె, ఇంజక్షన్ తీసుకునే మందులు మింగె. అయినా తగ్గలేదు. పైగా మెడనొప్పులు మొదలయినవి. ఆ డాక్టరుకు అనుమానమొచ్చి హైద్రాబాద్‌ల ఉన్న తన ఆర్థోపెడిక్ డాక్టరు మిత్రుని దగ్గరకు పంపె. అక్కడ మెడకు, నడుముకు ఎక్స్‌రేలు తీస్తె బయటపడె, తనకు సర్వైకల్ స్పాండిలోసిస్ లంబార్ స్పాండిలోసిస్ అని.

''మీ నల్లగొండ జిల్లా వాళ్లకు ఇదే ప్రాబ్లెమయ్యా. బొక్కలు అరుగుడు...'' ఎక్స్‌రే రిపోర్టు చూస్తూ నెమ్మదిగ అన్నడు డాక్టర్.

''ఎందుకొస్తుంది సార్ ఇది...''

''అనేక కారణాలుంటాయి. మీ జిల్లా వాళ్లకు నీళ్ల నుండి రావచ్చు...''

''పూర్తిగా తగ్గటానికి మందులున్నయా సార్?''

''మందులయితే ఉన్నయిగాని, పూర్తిగ తగ్గుతదని గ్యారంటీ లేదు. స్కూటర్, ట్రాక్టర్ నడుపుడు కంప్లీటుగ బందు చేయాల్సిందే. రైలు ప్రయాణం మంచిది. ఎంత విశ్రాంతి తీసుకొంటే అంత మంచిది...'' ఎటువంటి ఎక్సర్‌సైజులు చేయాల్నో వివరించి, మందులు రాసిండు.

ఇంగ్లీషు మందులు మింగిండు. తగ్గినట్టు తగ్గి మళ్లా నొప్పులు మొదలవుతాయి. ఎవరో అనుభవస్తులు చెప్పితే హోమియో మందులు నెలల తరబడి వాడుడు. ఇంగ్లీషు మందులకంటె నయమనిపించినయి మింగటానికి. ఏదైన బరువుపనో, పొలంపనో చేస్తే చాలు మళ్లా నొప్పులు మొదలు, ఈసారి ఆయుర్వేదిక్ వైద్యంలోకి. మెడ నొప్పులకు, నడుము నొప్పులకు కటివస్తి, గ్రీవవస్తి చేయించుకునె. ఈ ఆయుర్వేదిక్ మందుల ప్రభావం వల్ల సంవత్సరమో రెండు సంవత్సరాలో రిలీఫ్ ఇచ్చినట్లు ఇచ్చి, 'నేనెక్కడికి పోతా?' అన్నట్లు మళ్లా నొప్పులు.

ఈ గోస పడలేక మండల కేంద్రంలో ఉన్న డాక్టరు మిత్రునికి చెప్పుకుంటె, 'ఈసారి ఫిజియోథెరపి చేయించుకో. మీ వూర్ల నీళ్లు బందుచేసి ఏ మంజీరా నీళ్లో, పిల్టర్ నీళ్లో తెప్పించుకొని తాగు...' అంటూ సలహా ఇచ్చె.

ఇంకెన్ని మందులు మింగాలో, ఎంతకాలం మింగాలో, ఇంకే పద్ధతులకు పోవాలో అర్థం కావటం లేదు. ఇన్ని రకాలుగ వైద్యం చేయించుకుంటున్న తన పరిస్థితే ఇట్లుంటే అసలు మందులు మింగనోళ్ల పరిస్థితి ఏంది...?

''ఎట్లు పోయేది ఏముంది... ముందు నీళ్లు మార్చాలంట, బలమైన ఆహారం తీసుకోవాలంట. దాంట్లో కాల్షియం, మెగ్నీషియమ్, సి విటమిన్ ఉండాలంట...'' మీటింగుల చెప్పిన విషయాలను గుర్తు చేసుకుంటు అండు బాలయ్య.

''ఏం నీళ్లు మారుస్తం? ఏం మందులు మింగుతాం, రేపు రేపు ఈడ సంసారం చేసుడే కష్టముంది పో...'' గొణుక్కుంటు చెట్ల సాటుకు పోయిండు ఎల్లారెడ్డి మూత్రం కోసం.

ఎల్లారెడ్డి బాధలో అనుకుంటె ఆ మాటలు తనకే తాకినట్టనిపించింది సురేందర్‌కు. బంధుత్వం వుండటం, సునీత నచ్చటం వల్ల బీద కుటుంబం అయినా ఫర్వాలేదనుకొని హైద్రాబాద్ సంబంధం

చేసుకుండు. సునీత తల్లిదండ్రులది తనవూరే. వాళ్లు సునీత చిన్నతనంలో బతుకుదెరువు కోసం హైద్రాబాద్ పోయి స్థిరపడ్డారు.

ఇద్దరు పిల్లలయినంక గొడవ మొదలయింది ఇంట్ల.

''ఈ వూర్ల ఉండొద్దు...'' సునీత పోరు పెట్టింది.

''ఎందుకు?''

''ఎందుకేంది, ఈ వూర్ల నీళ్లు మంచివి కావంట...''

''ఎవరు చెప్పినరు నీకు?''

''ఎవరు చెప్పుడు ఏంది. పేపర్ల రావటం లేదా. అయినా మనూర్ల పనిచేస్తున్న టీచర్లుగాని, బ్యాంకోల్లు గాని ఒక్కరైనా ఈడ ఉంటున్నారా? అందరు పట్నం నుండో టౌన్‌ల నుండో వస్తుంటిరి...'' సునీతను ఎట్లు వప్పించాల్నో అర్థం కావటంలేదు సురేందర్‌కు.

ఈ వూరు నుండి కదలాలంటే ఎన్ని సమస్యలు? సునీతను, పిల్లల్ని టౌనుల ఉంచాలి. తాను వస్తూ పోతుండాలి. ఇది సాధ్యమవుతుందా తనకు?

సురేందర్ అదృష్టం కొద్దీ ఈ గొడవ ప్రారంభమైన కొన్ని రోజులకే మండల కేంద్రంల ఫిల్టర్ వాటర్ ప్లాంట్ పడింది. ఈ గొడవలు తాత్కాలికంగా ఆగిపోయినయి. పిల్లల్ని గూడ మండల కేంద్రంల ఉన్న కాన్వెంటు స్కూళ్ల ఏసి, రెండు మూడురోజుల కొకసారి ఫిల్టర్ వాటర్‌ను తెచ్చుకోవడం ప్రారంభమైంది. ఫిల్టర్ వాటర్ ఇండ్లకు వచ్చినంక సునీత గూడ తన మనసు మార్చు కున్నట్టుంది.

''నాకో అనుమానం, కల్లుల ఫ్లోరిన్ ఉంటదానె?'' మూత్రం పోసి వస్తూ వస్తూనే సురేందర్‌ను అడిగిండు ఎల్లారెడ్డి.

''ఉండదంట...''

''నీ యవ్వ నయ్యమయింది. దీంట్ల లేకుంట, ఉంటే సచ్చేటోళ్లమే...'' ఎల్లారెడ్డి.

''ఇదంత చూస్తుంటే ఫ్లోరిన్ ఉన్న మన తెలంగాణలో ఈ కల్లు ఉండబట్టి కనీసం దాన్ని తాగైన బతుకుతున్నమనిపిస్తుంది...'' ఏదో కనిపెట్టిన వాడిలా అన్నాడు రాములు.

''కావచ్చు తీయి, తొందరగ కానీయండి. పొద్దుపో తోంది...'' రాముల మాటలకు నవ్వుకుంట జీపు దగ్గరకు నడిచిండు సురేందర్.

''ఇంకో దమ్ము పడితే అయిపోయిది...'' పటువల కల్లు చూసుకుంటు అండు అంజయ్య.

సురేందర్ మనసు స్థిమితంగ లేదు. ఎల్లారెడ్డి పోయొచ్చిన దిక్కుకు పోయిండు.

చుట్టుపక్కల ఎక్కడ చూసిన తాటివనమే కనిపిస్తుంది. ఎవరి అడ్డల దగ్గర వాళ్లు తాగేటోళ్లు తాగుతున్నారు. పోయించుకొని పోయేటోళ్లతో ముచ్చట్లు పెట్టేటోళ్లతో కోలాహలంగా ఉంది వనం.

ఈమధ్య తాగక చాలారోజులయింది. కాస్త కల్లుకే కండ్లు తిరిగినట్టనిపించింది. నెమ్మదిగ జీపు దగ్గరి కొచ్చి జీపుల కూర్చుండు.

కల్లు పూర్తిచేసి నిలబడ్డరు అందరు.

గౌడుకు, గంపామెకు ఎంతెంత ఇవ్వాలో లెక్క చేసి ఎవరి డబ్బులు వాళ్లకిచ్చిండు బాలయ్య.

యాదయ్య ఇచ్చిన డబ్బులు ఇట్ల ఖర్చు చేసుడు సురేందర్‌కు ఇష్టం లేకున్న వాటిని ఏమి చేయాల్నో అర్థంకావటం లేదు. పైగా కల్లు తాగొద్దంటె ఒక్కరికి రాత్రిపూట సుక్క మూత్రం రాదు, దానికి తోడు మూత్రం మంట.

డ్రైవర్ జీపు స్టార్ట్ చేయగానే అందరూ జీపెక్కి కూర్చున్నారు.

''జాగ్రత్త...'' కదిలే ముందు అన్నడు సురేందర్.

''ఎందుకు సార్ కల్లు తాగినందుకా? గీ కల్లు నాకు ఏమైతది...'' నవ్వుకుంటనే జీపు వేగం పెంచిండు డ్రైవరు.

వచ్చిన దారిలో తిరుగుముఖం పట్టింది జీపు.

సరిగ్గా రాచకొండగుట్టల దగ్గర చేరిందో లేదో ఆ గుట్టల్ని చూసుకుంట అన్నాడు రాములు...

''మన జిల్లాలో దాంట్లకు పోయినోళ్లు ఎందుకు లొంగిపోతున్నారో ఇప్పుడు అర్థమవుతుంది, ఆలోచిస్తుంటే...'' ఎల్లారెడ్డి వైపు చూస్తూ అన్నాడు.

''అబ్బో ఏం అర్థమయిందో జర చెప్పు రాములన్న...'' ఎటకారంగానే అన్నాడు ఎల్లారెడ్డి.

సురేందర్ బాలయ్య గూడ వెనుకకు తిరిగినరు, రాములు ఏం చెపుతాడో విందామని.

''...పొద్దుగాల సంది చూస్తుంటే అర్థం కావటం లేదా. నాలుగూర్లు తిరిగేటోళ్లు వాళ్లు. ఆ నీళ్లు తాగి, ఈ నీళ్లు తాగి రోగాలు తెచ్చుకుంటరు. ఇంత పెద్ద గుట్టల్ని ఎక్కి దిగాలంటె ఏమైతది పాపం. గందుకే శాత గాక లొంగిపోతుంటారు.''

''బట్టతలకు మోకాలుకు ముడిపెట్టకురా. దానికి దీనికి సంబంధమేందిరా?''

''నీకు తెల్వదు తీయి...'' ఎల్లారెడ్డితో వాదించ బోయిండు.

"వెంకన్న చెప్పిండా నీకు ఈ సంగతి."

"ఎంకన్న నాకేమి తెల్సునే..." ఎల్లారెడ్డి మీదికి కోపంతో లేచిండు రాములు.

"అహే ఊకోండి. అందురు సుద్దబద్దలే..." బాలయ్య కోపంతో లేచిసరికి గమ్మునయిపోయింగ్రు అందరు. సురేందర్‌కు నవ్వాగలేదు.

సురేందర్ నవ్వుతుండగానే ఎల్లారెడ్డి అడిగిండు.

"సురేందరన్న సాగర్ నుండి మనకు మంచి నీళ్లు ఇస్తామని ప్రభుత్వం ప్రచారం చేసుకునె. ఇంత వరకు అతీగతి లేదు. మన పార్టీపరంగా ఏమి చేయ లేమా?"

వెంటనే ఏంచెప్పాలో అర్థంకాలేదు సురేందర్‌కు. కాంగ్రెస్, టిడిపి పార్టీలలోలాగా తన పార్టీల ఇంత గందరగోళం ఉంటదని ఊహించలేదు. ఇప్పుడిప్పుడే పరిస్థితులు అర్థం కాసాగాయి. అదే మొదలుపెట్టిండు చెప్పటం.

"...ఏం చేస్తమన్నా! పెడితే ఓ మీటింగు పెడతాం. మండల కేంద్రంలోనో, జిల్లా కేంద్రంలోనో ధర్నా చేస్తం. చేస్తే ఏమైతది? జిల్లా నాయకత్వం చూస్తే అట్లుండే. ఇద్దరు కేంద్ర మంత్రులు ఢిల్లీల ఉండి తెలంగాణ కోసం చేసేది చేస్తారుగాని, జిల్లాల మనం చేసేది మనం చేద్దాం అంటె కలిసొచ్చెటోడు ఉండడు. పులిచింతల గురించి బాధ, కృష్ణా నీళ్ల గురించి బాధ, కాలువ కిందోళ్లు మిర్యాలగూడ, హుజూర్‌సాగర్, కోదాడ వాళ్లకు ఎందుకుంటది చెప్పు, మనకు ఉంటదిగాని. మనకు చాతనైనకాడికి కలిసొచ్చే వాళ్లతో కలిసి పనిచేయటం తప్ప ఏం చేస్తాం చెప్పు..." బాధతో సురేందర్ ముగించి నడో లేదో బాలయ్య అందుకున్నాడు.

"నాగార్జునసాగర్ దగ్గర్లో యురేనియం తవ్వొద్దని మన మండల కేంద్రం సదస్సు పెట్టి, ధర్నా చేస్తే ఏమైంది, ఇల్లు తీసి పందిరేసినంత పనయింది. నా సంగతి పక్కనపెట్టు. సురేందరన్నకు తల ప్రాణం తోక కొచ్చినంత పనయింది..."

"ఏమైందన్న..." అని మిగతావాళ్లు అడగలేదు, ఏం జరిగిందో వాళ్లకు తెలుసు కాబట్టి.

'ఎవరు పెట్టమన్నారు ఈ మీటింగ్? మీ జిల్లా నాయకత్వం పట్టించుకోని ఈ కార్యక్రమం మీకు చేయా లనే ఆలోచన మీకెందుకు వచ్చింది? దీని వెనుక ఎవరన్నా ఉన్నారా? అసలు మీ బ్యాక్‌గ్రౌండ్ ఏంది?' అట్ల రకరకాల ప్రశ్నలతో వేధింపులు ఇంటలిజెన్సీ వాళ్ల నుండి. వాళ్లకు ఏదో చెప్పి తప్పించుకొనేసరికి తాతలు దిగొచ్చినంత పనయింది. ఇంటికొచ్చేసరికి ఇంట్ల ఏడుపులు.

"ఏమైంది?" అని అడిగితే,

"మీ మొగడు ఎవరో అండ చూసుకొని ఏదేదో చేయబోతుండు. సప్పుడు చేయకుండ ఉండకుంటె, నీ తాళి పుటుక్కుమంటిది..." ఎవడో ఫోన్ చేసి సునీతను బెదిరించిండు.

"థూ నీయవ్వా... ఏదో చేద్దామని వస్తే ఏం చేయ కుండ అవుతండె..." అసహనంతో ఊగిపోసాగిండు బాలయ్య.

...మళ్లీ తెలంగాణ నినాదం ఊపందుకొనే నాటికి సురేందర్ ఊర్ల ఎంతో కొంత ప్రత్యామ్నాయ నాయకుని గా ఎదిగి ఉన్నాడు. ఊర్ల చాలా సమస్యలు అటు కాంగ్రెసు, టిడిపి నాయకుల దగ్గరకు పోకుండ సురేందర్ దగ్గరికే వచ్చేటివి. ఏ పార్టీలో లేకుండ ఇంత నాయకునిగా ఎదగడం ప్రత్యర్థులకు అనుమానం వచ్చే సమయానికి టీఆర్ఎస్ పుట్టుకొచ్చింది. దాంట్లోకి పోవాలా వద్దాని చాలారోజుల పాటు పిసుకలాట పడ్డాడు. మిత్రులతో చర్చించిండు. పరిస్థితుల వల్ల దాంట్లో పోక తప్పలేదు.

పోవటమేగాదు, తానే బలవంతం చేసి బాలయ్యను టిఆర్ఎస్ తరపున యంపిటిసిగా నిల బెట్టడం, గెలుస్తరో లేదో అనుకుంటే పెద్ద మెజార్టీతో గెలువుడు, ఆ పిదప వచ్చిన సర్పంచ్ ఎన్నికలలో తను సర్పంచ్‌గా గెలువుడు, తన బ్యానర్ వాళ్లే ఎక్కువమంది వార్డు మెంబర్లుగా గెలవడం మండలంలోనే సంచలనం గా మారింది. దాంతో వూర్ల అనేక పుకార్లు పుట్టినయి...

'సురేందర్ పట్నంలో చదివేటప్పుడే వాళ్లు తెల్సు. ఏ పనిచేసినా వాళ్లను అడిగి చేస్తాడు. బాలయ్య వాళ్లకు అన్నంపెట్టి పోలీసులతో దెబ్బలు తిన్నోడేనాయె...' ఇట్ల మాటలు నడిచేవి ఊర్ల.

పొద్దు గూకే సమయానికి జీపు ఊర్లకు చేరు కుంది.

ఎక్కడ దిగేటోళ్లు అక్కడ దిగుకుంట, "అన్నా రేపు కలుద్దాం..." సురేందర్‌కు చెప్పుకుంటూ పోతు న్నారు.

సురేందర్ ఇంటికి చేరేసరికి జీపుల రాములు, సురేందర్ మిగిలినరు. జీపు దిగి సురేందర్ ఇంట్లకు నడిచిండు.

అప్పుడే ఇంట్ల నుండి బయటకు వస్తున్న సునీతకు సురేందర్ ఎదురయిండు. అతని చేతిల ఏమి

లేకపోయేసరికి ఏదో అనబోయి, వెనుకనే నీళ్ల క్యాను పట్టుకొని వస్తున్న రాములును చూసి ఆగిపోయింది. సంతోషంతో ముఖం విప్పారింది. ఏదో అడుగుదామని అనే లోపున రాములె అందుకున్నాడు.

''అక్కా, ఆటో కరాబు అయిందంట. నిన్న మొన్న నీళ్లు అందుకే పంపలేదంట. రేపటి నుండి వస్త యంట...'' వంటరూంలో క్యాన్‌పెట్టి దాంట్లో నీళ్లు వంచుకొని తాగుతూ అన్నాడు.

''సరే తీయిగాని, ఆడ పంచాయితీ ఎట్ల అయింది?'' కుతూహలంతో అడిగింది సునీత.

ఆడ జరిగిందంత చెప్పుకపోతుండు రాములు.

లోన ఉన్న చిన్న మంచం తీసుకొచ్చి ఇంటి ముందు చెట్టు కింద వేసుకుండు సురేందర్.

ఎప్పుడో పొద్దుగాల గింత తిని బయలుదేరిండే. మధ్యాహ్నమంత నీళ్లతో కల్లుతోనే సరిపోయె. వళ్లంతా పచ్చిపుండు తయారయింది. కడుపుల గడబిడ గ్యాస్ సమస్య. దాంతో సన్నగా తలనొప్పి ప్రారంభమైంది. అట్లనే మంచం మీద ఒరిగిండు.

ఈ శారీరక బాధల కంటె ఏదో వేధించసాగింది సురేందర్‌ను...

తిరుగుతున్న తలలో ఆ వూరి ప్రజల రూపాలే కండ్లల్ల తిరుగుతున్నట్టున్నాయి.

ఈ విషపునీళ్లు తాగి జనం వికృత రూపాలు పొందుతుంటే పట్టించుకొనెటోడు లేడు. ఎన్నికలప్పుడో, శంకుస్థాపనలప్పుడో దీని గురించి మాట్లాడుడు పిదప పట్టించుకొనే దిక్కు లేకపోయె. పోనీ పట్టించుకొని ఏదైన చేద్దామంటే నూటొక్క ప్రశ్నలు రాజ్యం నుండి. అంతవరకైతే బాగుండు రకరకాలుగా బెదిరించుడు. వినకుంటే చంపుడుదాక వచ్చే పరిస్థితులు...

...మొన్నగాక మొన్న ఎన్నికల్లో ప్రభుత్వ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా ఓ ఫ్లోరోసిస్ జీవి ఎన్నికల్లో పోటీ చేస్తే అతన్ని చంపుతామని అధికార పార్టీవాళ్లు బెదిరించిరి. ఈ ఫ్లోరోసిస్ వికృత రూపాల కంటె ఈ రాజ్యం యొక్క వికృత రూపాలే భయంకరంగా మారే. ''ఏంది ఇట్ల బెదిరించుడు న్యాయమేనా?'' అని తన పార్టీ వాళ్లను కమ్యూనిస్టు పార్టీవాళ్లను అడిగితే ఎవరు మాట్లాడరు.

నిస్సహాయంగా, నిర్వేదంగా బతుకులీడుస్తున్న ఫ్లోరోసిస్ జీవుల కంటె, తన బతుకు మెరుగేముంది, శారీరకంగా మానసికంగా జీవచ్ఛవాలుగా మార్చే ఈ విషపు నీళ్లు ప్రమాదమా? లేక మనుషుల్ని చైతన్యరహితులుగా మార్చే రాజకీయాలు ప్రమాదమా? దేని నుండి ముందు బయటపడాలి?

ఇవే ఆలోచనలతో, ప్రశ్నలతో ఇంతకుముందు సన్నగా మొదలైన తలనొప్పి తలపోటుగ మారింది...

*అరుణతార, ఆగస్టు 2006*